క్లుప్తంగా

గ్రామకంఠం భూమిని సర్వే చేయండి

నందిగామ: మండలంలోని రంగాపూర్ అను బంధ గ్రామం సల్వేంద్రిగూడలో గ్రామ కంఠం భూమిని సర్వే చేసి హద్దులు చూపాలని సోమవారం ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ రహ్మన్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ కంఠం భూమి వివరాలు సక్రమంగా లేకపోవడంతో హద్దు సమస్య ఏర్పడినట్లు తెలిపారు. కొంత మంది గ్రామ కంఠం భూమిని ఆక్రమించుకునే యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే సర్వే చేసి హద్దులు చూపాలని కోరారు. తహసీల్దార్‌ను కలసిన వారిలో గోవు రవి కుమార్, ఆంజనేయులు, అంజప్ప, మల్లేష్, రవి, బసవేశ్వర్ తదితరులు ఉన్నారు.

కౌలుకు ఆలయ భూములు

- 13న బహిరంగ వేలం ద్వారా అప్పగింత
- దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్

షాబాద్: కొమరబండ బుగ్గ రామేశ్వరస్వామి ఆలయ భూములను మూడు సంవత్సరాలు పాటు కౌలుకు బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోమరబండ గ్రామ సర్వే నంబర్ 54లో 14ఎకరాల 15గుంటలు, సర్వే నంబర్ 37లో 9ఎకరాల 4 గుంటలు, సర్వే నంబర్ 264లో 2 ఎకరాల 35 గుంటల భూమిని ఈ నెల 13 ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి 19 మార్చి 2026 వరకు వ్యవసాయం చేసుకునేందుకు కౌలు హక్కు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొన వచ్చని ఆయన తెలిపారు.

బాలింతలకు పౌష్టికాహారం



బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కొత్తూరు: పట్టణంలో సోమవారం పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నమో మాతృమూర్తి కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు బాలింతలు, గర్భిణులకు ప్రొటీన్, విటమిన్ కిట్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగరాజుచారి, నర్సింహాగౌడ్, మోహన్ సింగ్, నర్సింహ్మ యాదవ్, సుధాకర్, గణేష్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కొందుర్గు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లేడ్ చౌదరిగూడ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, కుర్చీల ఆట నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ మహేష్‌బాబు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని మహిళలు పురుషుల తోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రామస్వామి, మహిళా సమాఖ్య సభ్యులు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



పూజలో పాల్గొన్న వెంకట్‌రెడ్డి తదితరులు

నందిగామ: ప్రతిఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని శివ రామాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నెలకొన్న సాయిబాబా మందిరంలో దాతలు రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండ్ర శ్యాంసుందర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయులు రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి సొంత నిధులు లక్షలు హెచ్చించి సాయిబాబా ఆలయాన్ని నిర్మించడం అభినందించ దగ్గ విషయమన్నారు. మాజీ సర్పంచ్ రాంరెడ్డి, గ్రామస్తులు శంకరయ్య, లింగం, విక్రం శర్మ, శ్రీకాంత్, కుమార్, శ్రీనివాస్ రెడ్డి,ఈశ్వర్, రాములు, నర్సింహ, రమేష్, రాజీవ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తితో ఆర్థికాభివృద్ధి

పశువైద్యాధికారి దేవిరెడ్డి



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి దేవిరెడ్డి

మొయినాబాద్ రూరల్: పాడి పరిశ్రమతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని పశువైద్యాధికారి దేవిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నక్కలపల్లిలో సోమవారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు గ్రామాల్లో పాల ఉత్పత్తి ద్వారా ఎంతో మంది రైతులు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. పాడి పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పాల ఉత్పత్తి బాగా ఉంటుందని పేర్కొన్నారు. వేసవిలో ఉదయం, సాయంత్రం సమయంలో పశువులను మేతకు వదలాలన్నారు. మధ్యాహ్న సమయంలో ఎండలో ఉంటే పాల ఉత్పత్తి తగ్గుతుందని తెలిపారు. నక్కలపల్లిలో వందలాది మంది పాడి రైతులు ఉన్నారని, అధికారుల సూచనలు పాటిస్తే పశువులకు రోగాలు రావన్నారు. గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించడం ద్వారా 27 దూడలకు నట్టల మందు నివారణ వేశామని, 60 పశువులకు గర్భకోశ వ్యాధులు గుర్తించి వైద్యం చేసినట్లు తెలిపారు. మరో 30 పశువులకు సూడి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, వీఎల్‌వో పద్మ, ఎల్‌ఎస్‌ఏ కుమార్, వీఏ భీమ్, ఓఎస్ రవి, పాడి రైతులు అంజయ్యగౌడ్, వెంకటయ్య, మల్లేష్, రాజుగౌడ్, నీలకంఠం, గణేష్, రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'స్వయం పరిపాలన'

జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా వైష్ణవి, డిప్యూటీ కలెక్టర్‌గా అర్చన, డీఈఓగా సమీర్, ఆర్‌జేడీగా అక్షిత, హెచ్‌ఎంగా మానస, ఎంఈఓగా సానియా, వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – కొందుర్గు



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పేదలంటే లెక్కలేకుండా పోయింది



గుడిసెలు వేసుకున్న వారితో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: పేదలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయిందని, వారి సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి ఆరోపించారు. చేవెళ్లలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని, పట్టాల కోసం 20రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదేన్నారు. సోమవారం పేదలు వేసుకున్న గుడిసెలను పరిశీలించారు. పట్టాలు ఇచ్చే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మగ్బుల్, గుడిసెలు వేసుకున్న పలువురు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కిసాన్ సంఘ్

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి



రైతులతో సమావేశమైన రాజారెడ్డి

షాబాద్: రైతులకు భారతీయ కిసాన్ సంఘ్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజారెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ రైతు వేదికలో రైతులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల సాగుపై శాస్త్రవేతలు, అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అలాగే పార్టీలకు అతీతంగా రైతులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మండలంలోని చర్లగూడ, బొబ్బిలిగామ, మాచన్‌పల్లి, బోనగిరిపల్లి తదితర గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాలను ఎగురవేశారు. నాగర్‌గూడ రైతు కిషన్‌నాయక్ వరి పంట సాగు చేశాడని, పైరు బాగా ఎదిగినా గింజ రాక నష్టపోయాడని తెలిపారు. రైతులు ఇలా పంట నష్టపోకుండా అధికారులు సలహాలు ఇవ్వాలని కోరారు. పంటలకు విద్యుత్ సమస్యలు ఎదురైతే 18004253600కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యావరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింహులు, చంద్రబాబు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాడే నాయకున్నే ఎన్నుకోవాలి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప



పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్ రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడే నాయకుడినే ఎన్నుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప కోరారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద, మధురాపూర్, వెలిజర్ల, దూ సకల్ ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలల్లో, మొగిలిగిద్ద కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటప్ప మాట్లాడుతూ.. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి తమ విలువైన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, విద్యారంగం వికాసం కోసం కంకణ బద్ధునిగా, జవాబుదారుడిగా అందుబాటులో ఉంటున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. అనంతరం పాపన్నగారి మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు నర్సింలుగౌడ్, రఘుపాల్, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, రాములు, వెంకటరమణ, ప్రహ్లాదరావు, వెంకటేశ్వర్లుగౌడ్, బాలయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యం టీడీపీ ఘనతే

పొలిట్‌బ్యూరో సభ్యుడు నర్సింలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మొయినాబాద్: ప్రజల్లో రాజకీయం తెచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు పేర్కొన్నారు. సోమవారం మొయినాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటేల్ పట్వారి వ్యవస్థను నిర్మూలించి తెలంగాణలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తెచ్చింది తెలుగుదేశం పార్టీనే అని అన్నారు. బడుగు బలహీన వర్గాలు, మహిళల్లో రాజకీయ చైతన్యం తెచ్చామని పేర్కొన్నారు. టీడీపీ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కొమ్మిడి వెంకట్‌రెడ్డి, నాయకులు ఆకుల పద్మారావు, మాణిక్యం, యాదయ్యగౌడ్, రాజుగౌడ్, వెంకటేష్‌ముదిరాజ్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవరెడ్డి, హరీష్, జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆల్ స్టైల్ కరాటే, కుంగ్‌ఫూ షాటోఖాన్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో సంధ్య, నందిని, కీర్తన, వైష్ణవి, ద్వితీయ స్థానంలో భాగ్యశ్రీ, లావణ్య, ఎం వైష్ణవి, తృతీయ స్థానంలో అశ్విని, భార్గవి, స్నేహ నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌యం శివకుమారి, కరాటే మాస్టర్లు ఎత్తిన చెన్నయ్య, శివకృష్ణగౌడ్ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం: విశాల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాల

కేశంపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్త్రీ శిసంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీలు మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు. ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగం మార్చి 8న మహిళలు మొక్కలు నాటి సంరక్షించాలని ఆమె కోరారు.

'కంటి వెలుగు' పేదలకు వరం



గోపులారంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

శంకర్‌పల్లి: కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగపడుతోందని గోపులారం సర్పంచ్ పాడువు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని గోపులారంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మొక్కల సంరక్షణపై శ్రద్ధ

పరిగి: మొక్కల సంరక్షణపై ప్రత్యేక కార్యచరణ రూపొందించామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ చెప్పారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పలు కాలనీల్లోని పార్కులను సందర్శించి, మొక్కలకు నీరు పట్టారు. అనంతరం మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్క బతికేలా మున్సిపల్ సిబ్బందితో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



జేసీబీతో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

చేవెళ్ల: మండల కేంద్రంలో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న మినీ స్టేడియం ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి చొరవతో బాగుపడుతోంది. సోమవారం మినీ స్టేడియంలో ముళ్ల పొదలను జేసీబీతో తొలగించి చదును చేయించారు. వాకింగ్, అలాగే క్రీడా మైదానం అభివృద్ధికి ఎంపీ సొంత నిధులు సమకూర్చారు. దీంతో పనులు వేగంగా సాగుతున్నాయి. మినీ స్టేడియం అందుబాటులోకి రానుండడంతో యువత సంతోషం వ్యక్తం చేస్తోంది.

నిందితులపై చర్యలు తీసుకోండి

నందిగామ: ఇటీవల పట్టణ శివారులో ఈత చెట్లను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నందిగామ ఉప సర్పంచ్ మెక్కొండ కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నందిగామ, అంతిరెడ్డి గూడ గ్రామాలకు చెందిన సుమారు 120 కుటుంబాలు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, ఇటీవల కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈత చెట్లను నరికి తగులబెట్టారని తెలిపారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి

షాబాద్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని తాళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో చదవాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రులు కన్నా కలలను నిజం చేయాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ పెంటయ్య, ఉపాధ్యాయులు కిరణ్మయి, సంఘమేశ్వర్ రెడ్డి, ప్రభాకర్, సత్యనారాయణ, శోభారాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశానికి హాజరైన పదో తరగతి విద్యార్థులు

నిర్వహణ చేతకాకే నిర్వీర్యం



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర ప్రభుత్వంపై పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఫైర్

షాద్‌నగర్ టౌన్: ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ ఎదురుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్లచెన్న ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రధాన మంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థలు బీఎస్‌ఎన్‌ఎల్, రైల్వే, ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ వంటి వాటిని ప్రైవేట్‌పరం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో నష్టాలు వస్తున్నాయని, అందుకే ప్రైవేట్ పరం చేస్తున్నామని చెపుతూ వాటిని పూర్తిగా నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. నిర్వహణ లోపాలు పెట్టుకొని లాభాలు రావడంలేదంటే మరి ప్రైవేట్ వారికి ఏ విధంగా లాభాలు వస్తున్నాయని ప్రశ్నించారు. ప్రైవేట్ సంస్థలకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారే తప్పా లోపాలను సరి చేయడం లేదని ఆయన అన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా చింపుల సత్యనారాయణరెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. సభ్యులుగా బండారి ఆగిరెడ్డి, ఎస్ వసంతం, గడ్డమీది పెంటయ్యగౌడ్, షాబాద్ దర్శన్, గౌరి సతీష్, పి.సురేందర్‌రెడ్డి, ఎ.మధుసూదన్‌రెడ్డి, భీం భరత్, కొమ్మరెడ్డి ఉదయ్‌మోహన్‌రెడ్డి, దేవ్లా నాయక్, పోలీస్ మధుసూదన్‌రెడ్డి, మహ్మద్ ఇక్బాల్‌లు నియమితులైనట్లు ప్రకటించారు. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి రానున్నట్లు తెలిపారు.